

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని అడుగుల పుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామంలో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. తాగడానికి కూడా మంచినీరు దొరకక గ్రామస్తులు దగ్గర్లో ఉన్న పెద్ద గడ్డ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా 9 లక్షలు మంజూరు చేసిందని బోరు తీసి పనులు నిలిపివేశారన్నారు.గ్రామంలో అధిక సంఖ్య మంది వెనుకబడిన పివిటిజీ తెగలవారు కావడంతో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ ఇల్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఇల్లు నిర్మాణానికి కూడా నీరు దొరకకపోవటంతో మధ్యలోనే నిలిచి పోయాయన్నారు ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్, సిపిఎం నాయకులు వి.రాజు, వినోద్ కుమార్, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

-కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నయ్య పడాల్ - ఎపిఎఫ్‌డిసి రీజినల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి -చింతపల్లి:- కాఫీ తోటలలో పనిచేస్తున్న కాపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ఏడాది కాపీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్చించి ఐదు నెలలు గడిచినా సమస్యలు పరిష్కరించడంలో కాపీ యాజమాన్యం విఫలం చెందిందని కాఫీ కార్మిక సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. శనివారం సిఐటియు నాయకుడు అంపురంగి బుజ్జిబాబుతో కలిసి చింతపల్లి ఏపీఎఫ్‌డిసి రీజినల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, గత ఏడాది 11వ నెలలో ఏపిఎఫ్‌డిసి అధికారులతో చర్చించడం జరిగిందని, దీనిలో భాగంగా 11 డిమాండ్లు పరిష్కారానికి ఏపీడీసీ అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఐదు నెలలు గడుస్తున్న నేటికీ కాపీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన అన్నారు.కాపీ కార్మికుల సమస్యలు పరిష్కరించమంటే కాకమ్మ కథలు చెప్తూన్నారన్నారు. హెల్పర్లకు నెలకు 26 వేల జీతాలు ఇవ్వాలని, ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో మినిమం పెరగాల్సిన కూలి రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. కాఫీ తోటలలో కండక్టర్స్ నియామకం చేపట్టాలని, హెల్పర్లకు తక్షణమే నియమకం చేపట్టాలని, కాఫీ కార్మికులకు నిత్యావసర సరుకుల ధరల ఆధారంగా కూలి రేట్లు పెంచాలన్నారు. కాపీ కార్మికులకు 26 రోజులు పని దినాలు కల్పించాలని, నివాసం ఉంటున్న గృహాలకు మరమత్తు పనులు చేపట్టాలని, హెల్పర్ లందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, కాపీ కార్మికులకు టిఎడిఎల్ ఇవ్వాలని, వారపు పేమెంట్లు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాపీ తోటల్లో పనిచేస్తున్న కార్మికులకు పొరపాటున ప్రమాదాలు జరిగితే ఆస్పత్రి ఖర్చులు యాజమాన్యమే చెల్లించాలని, ఏడాదికి పండగల మాస్టర్లు అమలు చేసి కూలి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ తోటల్లో పని చేస్తున్న కాపీ కార్మికుల పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, కాఫీ కార్మికులు

వర్షాలకు కూలిన పాఠశాల భవనం

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- మండలంలో శుక్రవారం ఈదురుగాలులు పిడుగు శబ్దాలతో కూడిన భారీ వర్షం కురిసింది.ఈ వర్షం తాకిడికి పోతంగి పంచాయతీ చంపపట్టి ఎలిమెంటరీ పాఠశాల భవనం పై కప్పు రేకులు ఎగిరిపోయి నేల కొరగడంతో పాటు గోడలు కులాయి.. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉన్న మరమ్మత్తు చేయక పోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షానికి కూలి పోయినట్లు ఆ గ్రామస్తులు చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. తక్షణమే అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు కూలిన చంపపట్టి పాఠశాల పౌనాన్ని స్థానిక మండల వైసిపి కార్యదర్శి ఎం.శంకర్ శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల భవనం కూలడంతో విద్యార్థులకు తరగతులు జరగడానికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించి తరగతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ కే విజయదశమి గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

వాహనం దగ్ధం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళ్తున్న మహేంద్ర సుప్రోవిక్స్ (టాటా మ్యాజిక్) ఏపీ 39 టిఎన్ 9664 గల వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని చిన్నగడ్డ గ్రామ సమీపన చోటు చేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం రేవు పోలవరం ప్రాంతానికి చెందిన మహేంద్ర సుప్రోవిక్స్ చింతపల్లి ప్రాంతానికి వచ్చి తిరుగు ప్రయాణం చేస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళుతుండగా చిన్నగడ్డ గ్రామ సమీపన మలుపు వద్ద వాహనం ముందు భాగంలో ఒకసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ వాహనాన్ని చాకచక్యంగా నిలుపుదల చేసి ప్రాణాలను రక్షించుకున్నాడు. వాహనంలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలు ఎగిసి పడడంతో చింతపల్లి నర్సీపట్నం ప్రధాన రహదారిలో వాహనాలు సుమారు రెండు గంటల పాటు రాకపోకలకు నిలిచిపోయాయి. డ్రైవర్ పరార్‌లో ఉన్నారు.



దగ్ధమవుతున్న వాహనం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మి, అటవీశాఖ అధికారులు

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిపి

- ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూముల్లో పనులకు అటవీశాఖ అడ్డుపడుతున్నట్లు స్థానికుల ఫిర్యాదు
- పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న ఫారెస్టు రేంజ్ అధికారి

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని గుల్లేటివాడ గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు పరిశీలించారు. అక్కడ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మట్టి పని సరిగ్గా జరగడం లేదని, సకాలంలో కూలి డబ్బులు పడడం లేదని కూలీలు చెప్పారు. గుల్లేటివాడ గ్రామంలో గిరిజనులకు పోడు భూముల పట్టాలు గతంలో ఇచ్చారని, ఆ భూముల్లో నేడు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చెరువు నిర్మాణాల పనులు చేపడుతుంటే అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని, దీంతో తమకు పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎంపీపీ సంబంధిత చింతూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌తో మాట్లాడారు. సదరు అధికారి వారి కింద స్థాయి సిబ్బందిని వెంటబెట్టుకుని గుల్లేటివాడ గ్రామానికి విచ్చేసి గ్రామస్తులతో సమావేశమై వారికున్న సమస్యలను తెలుసుకున్నారు. పోడు భూముల హక్కు పత్రాలు వాస్తవమే అయితే ఆ భూముల్లో జరిగే ఉపాధి హామీ పనులను అడ్డుకునేది లేదని ఫారెస్ట్ రేంజర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు కారం సుందరయ్య, పోడియం శ్రీరామ్మూర్తి కమ్మచిచ్చు సత్యనారాయణ, పీసా కమిటీ కార్యదర్శి గుట్టప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదం జరిగినప్పుడు చేయాల్సిన పనులపై తెలియజేస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు, నివారణపై ఏరియా ఆసుపత్రి సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక స్టేషన్ ఆఫీసర్ గంగన్న మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఏ విధంగా అరికట్టాలో తెలియజేశారు. ఏరియా ఆసుపత్రిలోని ఫైర్ ఎక్విప్మెంట్ ఎలా ఉపయోగించాలి అనే విషయాలపై ఆసుపత్రి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వాటిని వినియోగించడంపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

23న మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 23న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు అన్ని శాఖల అధికారులతో రివ్యూ ఉంటున్న నేపథ్యంలో అందరూ అధికారులు తమ రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరైనా గైరాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- సిపిఎం మండల కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

ముస్లిం వ్యతిరేక వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టంపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను సిపిఎం నాయకులు మండలంలోని ముస్లిములకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మతోన్మాద మోడీ ప్రభుత్వం రాజ్యాంగంపైనా, మైనారిటీ హక్కులపైనా దాడి చేస్తుందని, దేశ లౌకిక పునాదులను దెబ్బతీస్తూ ప్రజల మధ్య మతపరంగా చీలికలు తెస్తుందని విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ముస్లిములకు సిపిఎం మద్దతు తెలపటం పట్ల ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, షాజహాన్, ముస్లిం యూత్ శాహంష, హసన్, ఫయాజ్, రియాజ్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రచురించిన వక్ఫ్ ప్రత్యేక సంచికను పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న రవిప్రసాద్

పాడేరులో రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సమాజంలో ప్రేమ, శాంతిస్థాపనే లక్ష్యంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆరాధన టీవీ యాజమాన్యం పిలుపుతో బిషప్ సిహెచ్.దైవకృప సమన్వయంతో పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్, యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో జరిగింది. పాస్టర్ పి.జాన్ ఫ్రెడిక్ అధ్యక్షత వహించారు. పాస్టర్ శామ్యూల్ జాన్ ప్రార్థన చేయగా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. గీతాలాపనలు, ప్రసంగాలు, ప్రార్థనలు చేస్తూ ఆర్ టిసి కాంప్లెక్స్ నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ మీదుగా సుండ్రుపుట్టు జంక్షన్ చర్చి వరకు సాగింది. యుసివైఎ చీఫ్ ఆర్.జాన్, పాస్టర్స్ వి.మోసెస్, ఎం.బాబురావు, జి.తిమోతి, వైవై రత్నం, ఎస్.అబ్రహం, పి.డేవిడ్, కెవి సుధాకర్, పాల్ బిల్లీ గ్రేహం, బ్రదర్ జె.సైమన్, తదితరులు యేసు పునరుత్థానమును గూర్చి ప్రసంగించారు. కార్యక్రమంలో పాస్టర్స్ సిహెచ్.బుచ్చయ్య, ప్రేమ్ కుమార్, ఎం.డానియల్, వి.మత్స్యరాజు, వి.జాషువా, యోబు, పాపిటిరావు, ఇశ్రాయేలురాజు, యుసివైఎ ప్రతినిధులు ఎలీషారావు, భాస్కరరావు, సత్యారావు, స్టీవెన్ శ్రీనివాస్, రవికుమార్, గ్లోరియస్, సంజీవ్ పాల్గొన్నారు.



శారద చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

ఘనంగా శారదా నికేతన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ మత్స్యరాజు అధ్యక్షతన శనివారం పాఠశాల ఆవరణలో గ్రాడ్యుయషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి శారద ట్రస్ట్ మేనేజ్మెంట్ అడ్వైజర్ రోజా కిరణ్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, అరకువ్యాలి శారదా నికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ చిరంజీవులు హాజరయ్యారు. డి శారద చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల నృత్యాలు, పలు వేసాధారణ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించడంతో చిన్నారులు ఉత్తేజం పొంది విద్యా భ్యాసంలో మక్కువ చూపుతారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్ రాజు, ఉపాధ్యాయులు ధర్మారావు , గోపి, పాఠశాల విద్యా కమిటీ మెంబర్స్ ఎంఎం శ్రీను, కృష్ణకుమారి, సిఆర్పి అనిల్ కుమార్, ఐద్వా మండల అధ్యక్షురాలు ఈశ్వరి, శారద నికేతన్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

పలుచోట్ల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం



పాడేరులో చెత్త తీసుకెళ్తున్న అధికారులు



దేవీపట్నం ఇందుకూరు పేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్

స్వచ్ఛాంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ ఎపిఓలు ఎం.వెంకటేశ్వరరావు, వి.ఎస్.ప్రభాకరరావులు, సిబ్బంది కార్యాలయం పరిసరాలను శనివారం శుభ్రం చేసారు. ఐటిడిఎ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. సిబ్బంది కంప్యూటర్లను శుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, ఎపిఒ పబ్లిసిటీ పి.రాములు, పిఐయు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, ట్రైకార్ సహాయకులు సీతా రామయ్య, వెలుగు ఎపిఎం వి.ఎస్.ప్రసాద్, ఐటిడిఎ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండల కేంద్రంలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల నుంచి మండల కేంద్రం మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వ్యర్థాలను, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది లక్ష్మణ్, నాగేంద్ర పాల్గొన్నారు.

చింతపల్లి : పరిసరాల పరిశుభ్రతను అందరు బాధ్యతగా తీసుకోవాలని ఎస్సైలు ఎం వెంకటరమణ, వెంకటేశ్వరరావు అన్నారు. సీఐ వినోద్ బాబు పర్యవేక్షణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, అంగన్వాడి, ఆశ వర్కర్లు, వెలుగు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో బాటు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి వడుగుల జ్యోతి, రాజవొమ్మంగి, జడ్డంగి సర్పంచులు గొల్లపూడి రమణి, కొంగర మురళీకృష్ణ, మండల తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీఓ యాదగిరిశ్వరరావు, ఎంపిటీసీ గొల్లపూడి పెద్దరాజు, సిడిపిఓ దేవామణి, టిడిపి గణజాల తాతారావ్, సింగిరెడ్డి రామకృష్ణ, పాల్గొన్నారు.

దేవీపట్నం : స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఇందుకూరుపేట గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, అంగన్వాడి, ఆశ వర్కర్లు, వెలుగు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు, విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, తహశీల్దారు కె.సత్యనారాయణ, ఎంపీపీ కొంచెం మురళి, మండల స్పెషల్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఈవో, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం ఏపీ జెన్కో ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఏపీ జెన్కో కార్యాలయాల వద్ద వ్యర్థాలను సేకరించి దూరంగా తరలించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఆఫీసులో దీర్ఘకాలికంగా ఉన్న కంప్యూటర్లు, సెల్ ఫోన్లు, ల్యాండ్ ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులు సురక్షిత పద్ధతులు రీసైకిల్‌కు అప్పగించారు. కార్యక్రమంలో డీఈఈ దుర్గా శ్రీనివాసరావు, ఏఈ సిహెచ్ సురేష్, ఏపీ జెన్కో ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, డిఎవి ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



దుంబ్రిగుడలో....



వాలీబాల్ కిట్టు ఇస్తున్న డిఎస్‌పి

వాలీబాల్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి -జిమాడుగుల: మండలంలో లోవాసింగి పంచాయతీ సంగులయ్య గ్రామాన్ని పాడేరు డి.ఎస్.పి సాబాజ అహ్మద్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక గిరిజనులతో మాట్లాడుతూ, గంజాయి పండించినా అక్రమంగా రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువకులు అసాంఘిక కార్యక్రమాల కు దూరంగా ఉండాలని పలు సూచనలు సలహాలు తెలియజేశారు, యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు , పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు



పోటీలను ప్రారంభిస్తున్న బాలరాజు

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలో ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లి లో షటిల్ టోర్నమెంట్ ను గిరిజన సంక్షేమ శాఖ మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు స్థానిక సీఐ వినోద్ బాబు తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దురియ హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్య, ఎస్ఐ లు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ కోరాబు బాలం పడాల్, ఎంపిటిసి సభ్యురాలు ధారలక్ష్మి, చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డి సత్యనారాయణ (సతీష్) ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిహెచ్‌డి ప్రవేశాలకు గీతం ఆన్‌లైన్ పరీక్ష

- స్కాలర్లకు నెలవారీ ఫెలోషిప్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పిహెచ్‌డి ప్రవేశ ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు గీతం ప్రాంగణాలలో ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఫార్మసీ, లా, ఆర్కిటెక్చర్, పబ్లిక్ పాలసీ వంటి విభిన్న విభాగాలలో పిహెచ్‌డి ప్రవేశాలకు మే 25న ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు గీతం రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ వి.నందూరి తెలిపారు. ఫార్మసీ విభాగానికి సంబంధించి ప్రత్యేక ప్రవేశ పరీక్ష వేరుగా జూన్ 1న నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష తరువాత ఇంటర్వ్యూలు జూన్ 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. నాణ్యమైన పరిశోధనను ప్రోత్సహించే దిశగా, గీతం నెలవారీగా రూ.33 వేలు ఫెలోషిప్‌ను పిహెచ్‌డి స్కాలర్లకు అందిస్తుందని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అధికారిక రీసెర్చ్ అడ్మిషన్ పోర్టల్ https://researchadmissions.gitam.edu సందర్శించి దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేయాలని, పూర్తి వివరాలతో దరఖాస్తులను మే 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.

వైసిపి పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి శూన్యం

జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ విమర్శించారు. పాడేరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసిపి పాలన లో ఉత్తరాంధ్ర అభివృద్ధి శూన్యమని, కనీసం అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కేవలం భూములు దోచుకోవటం, దోచుకొనే పనిలోనే ఉండేదన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలో పూర్తిగా జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీసం రాష్ట్రంలో ఇల్లు ఇవ్వలేని దుస్థితిలో జగన్ ప్రభుత్వం ఉండేదన్నారు. పెన్షన్,రేషన్ కార్డులు ఇవ్వలేదని, అందుకే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారన్నారు. వైసీపీ గత పాలనలో కార్మికులందరూ రోడ్డు మీద పడ్డారని, నిరుద్యోగులకు కనీసం ఉద్యోగం ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. త్వరలో కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కంపెనీలు పెట్టి తద్వారా 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. రోడ్లు



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ రాజు, దారేల సర్పంచ్ టిడిపి డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి, మహిళా నాయకులు మహేశ్వరి, సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, క్లస్టర్ ఇన్చార్జి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి హామీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని 24 పంచాయతీల గ్రామాల్లో లబ్ధిదారులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో ఏ వి వి కుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క లబ్దిదారుడుకు క్రమం తప్పకుండా పనులు కల్పించాలన్నారు. పనికి తగ్గట్టు 307 రూపాయలు కూలి రేటు చెల్లించాలని సూచించారు. 2025-26 సంవత్సరంలో హార్టికల్చర్ రైతులను గుర్తించి ఈనెల 25 తేదీన డేటా సమాచారం అందించాలన్నారు. ప్రతి పంచాయతీలో 25 ఫారం ఫండ్స్ పనులు పూర్తి చేసి యాప్‌లో అప్లోడ్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అర్జున్ .నాయుడు సిబ్బంది పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బడిలో చేర్పిద్దాం అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండిబ పంచాయతీ పరిధి నడిమీ వలస గ్రామంలో శనివారం చేపట్టారు. యూటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరాజి. మల్లేశ్వరరావు పాఠశాల విద్య కమిటీ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలకు బడిలో చేర్పించే కార్యక్రమాన్ని రాష్ట్ర యుటిఎఫ్ కమిటీ పిలుపు మేరకు ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బడి ఈడు పిల్లలకు బడిలో చేర్పించేందుకు తల్లితండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ సీతారాం, తల్లిదండ్రులు పాల్గొన్నారు



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

నేడు గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్సీ యల్ పాఠశాలలో 5,6,7,8,9 తరగతుల ప్రవేశాలకు ఈనెల 20న ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి సూర్యశంకర్‌రావు శనివారం విలేకరులకు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9 గంటలకే విద్యార్థులు హాజరు కావాలన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. కారుషెడ్ సమీపంలోని ఒక స్వీట్ దుకాణంలో పనిచేస్తున్న అశోక్ ఈనెల 17వ తేదీన దుకాణానికి రాలేదు. దుకాణం యజమాని ఇంట్లోనే అశోక్ ఉంటున్నాడు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో యజమాని అనిల్ బిష్ణనోయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : గంజాయి రవాణా చేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పాపునాయుడు తెలిపారు. చోడవరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజ్ ఎదురుగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా, ముందస్తు సమాచారం ప్రకారం ఎక్సైజ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ చెందిన మదన్ బాలాజీ, ఎస్ దినేష్ ఇద్దరు నిందితుల నుండి 3.85 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ గంజాయిని పాడేరులో రూ.10 వేలుకు కొనుగోలు చేశామని, తమ ప్రాంతంలో రూ.50 వేలుకు విక్రయిస్తామని వారు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- మాడుగుల: ఓ వ్యక్తి ఉరి వేసుకొని చనిపోయిన సంఘటన మండలంలోని జాలంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాలంపల్లి గ్రామానికి చెందిన పినబోయిన లోవ (38) మద్యానికి బానిస అయ్యాడు. మద్యం మానేయాలని అతని భార్య లక్ష్మి పలుమార్లు చెప్పింది. ఈ మేరకు ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో గురువారం మాడుగుల పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో, పోలీసులు భార్యా భర్తలిద్దరికి సర్ది చెప్పి పంపించారు. అయినప్పటికీ భర్త మద్యం మానకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్ళి పోయింది. భర్త లోవ శుక్రవారం సాయంత్రం మూడు గంటల సమయంలో పాక వద్ద ఉరివేసుకొని మృతి చెందాడని ఎస్సై జి.నారాయణరావు తెలిపారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పంచనామాకి తరలించడం జరిగిందని తెలిపారు.

పశువులు, మామిడి పంటకు 26న వేలం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్లశాఖ ఆదేశాల మేరకు విశాఖ కేంద్రకారాగారంలోని డెయిరీఫారంలో ఉన్న 14 పశువులను, మామిడి తోట పంటను ఈ నెల 26వ తేదీన వేలం వేయనున్నట్టు కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన కేంద్రకారాగారం పరేడ్ మైదానంలో ఉదయం 10 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. డిపాజిట్ కింద రూ.1000 జమ చేయాలని, వేలం పాడుకున్న వ్యక్తి డబ్బులను ఒకే దఫా చెల్లించాలని తెలిపారు. డబ్బు చెల్లించకుంటే పాట, డిపాజిట్ రద్దు పరిచి ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందని వివరించారు.

జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు శొంఠ్యాం ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ శ్రీ వెంకట్ విద్యపీట్ చైర్మన్ రొంగలి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల రోలుగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఢిల్లీలో జరిగనున్న జాతీయ స్థాయి ఘట్కా పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించడానికి ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ ఏర్పాటుచేసి వివిధ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వెంకటేశ్వరరావు, కోచ్ లెంక అప్పలరాము, టీమ్ మేనేజర్ గవర ఈశ్వరరావు అభినందించారు. విద్యార్థులు జాతీయస్థాయి ఘట్కా పోటీలలో విజయం సాధించి రాష్ట్రానికి, ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



ర్యాంకులు సాధించిన శ్రీ విశ్వ విద్యార్థులు

జెఇఇ మెయిన్స్‌లో సత్తా

- మెరుగైన ర్యాంకులు సాధించిన ఉమ్మడి విశాఖ విద్యార్థులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వారిని పలువురు అభినందించారు.

కొమ్మాది : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ (మారికవలస) నుంచి హాజరైన విద్యార్థుల్లో 8 మంది ప్రతిభకనబరిచారు. సంస్థ నుంచి 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ముగ్గురు విద్యార్థులు దేశంలోనే ప్రతిష్టాత్మక ఎన్ఐటి, ఐఐఐటిలలో సీట్లు సాధించే దిశగా ర్యాంకులు తెచ్చుకున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.శివ ప్రసాద్ తెలిపారు. మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ గౌడ్ అభినందించారు.

శ్రీ విశ్వ విద్యార్థుల జయభేరి

ఎంవిపి.కాలనీ : జెఇఇ మెయిన్స్ 2025 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు విశాఖలోని తమ విద్యాసంస్థకు చెందిన వారు 311, 407, 586, 648, 688 ర్యాంకులు సాధించారని, 100లోపు ఐదుగురు, 5 వేలలోపు 29 మంది, 10 వేలలోపు 47 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారని మొత్తంగా 247 మంది విద్యార్థులు ఎన్ఐటి, ఐఐఐటిలలో సీటు పొందేందుకు ర్యాంకులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.ధర్మరాజు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

అసెంట్‌కు ర్యాంకుల పంట

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో అసెంట్ కళాశాల విశాఖపట్నం విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని సంస్థ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. తమ కళాశాల విద్యార్థి ఎస్.పూజితకృష్ణ జాతీయ స్థాయిలో రిజర్వుడు కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించాడని వెల్లడించారు. అతనితో పాటు వరుసగా 203, 208, 408, 450, 618, 813, 926, 941, 983, 1102, 1322, 1361, 1636, 1702 ర్యాంకులతోపాటు 5000 ర్యాంకులలోపు 31 మంది సాధించారని తెలిపారు. తమ సంస్థ నుంచి ఈ ఏడాది మొత్తంగా 204 మంది విద్యార్థులు అర్హత సాధించారని పేర్కొన్నారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

నక్కపల్లి : పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ విద్యార్థులు జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ర్యాంకుల పంట పండించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. కె.సత్య సాయి శ్రీనివాస్ భగవాన్ 77వ ర్యాంక్, డేవిడ్ జాన్సన్ దేవి 2948 ర్యాంక్ సాధించారని, జెఇఇ అడ్వాన్సుడ్‌కు 23 మంది అర్హత సాధించారని వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, వివిఎస్ఎస్.భానుమూర్తి, అభినందించారు.

సత్తా చాటిన 'ఆకాష్'

సీతమ్మధార : జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విశాఖలోని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. కోతపల్లి నిఖిల్ సాయి, గట్టు శ్రవణ్‌సాయి వరుసగా 99.59, 99.31 శాతం సాధించారని సంస్థ ముఖ్య విద్యా వ్యాపార వ్యవహారాల అధికారి ధీరజ్ కుమార్ మిశ్రా తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. రీజినల్ సేల్స్ హెడ్ నిషాంత్ మిశ్రా, అసిస్టెంట్ డైరెక్టర్ వై.లక్ష్మీనారాయణ, బ్రాంచ్ హెడ్ రాజేష్, ఇతర ఫాకల్టీ సభ్యులు పాల్గొని అభినందించారు.

ఆఖరి వరకూ హైడ్రామా !

- తొలుత సంఖ్య తప్పి కూటమికి కన్నులొట్టపోయిన వైనం
- ఆఖరి నిమిషంలో గట్టెక్కిన 'అవిశ్వాసం'
- మేయర్ పీఠం కైవసం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు 'కూటమి' నేతలకు చివర వరకూ చుక్కలు కనిపించాయని చెప్పక తప్పదు. జివిఎంసి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం, ఓటింగ్ ప్రక్రియ విశాఖ నగర ప్రజలనే కాదు యావత్తు రాష్ట్రాన్నే శనివారం ఉత్కంఠకు గురిచేశాయనడం అతిశయోక్తి కాదు. తుదకు హైడ్రామా నడుమ అవిశ్వాసాన్ని కూటమి నెగ్గింది. ఉదయం 11 గంటల వరకూ.. అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశంలో ఆశీనులయ్యే వరకూ 74 మ్యాజిక్ ఫిగర్‌ను చేరుతామా ? లేదా ? అన్న అనుమానాలతోనే కూటమి నేతలంతా ఉన్నారు. చాలాసేపు టిడిపి నేతలు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్‌ల ముఖాలు వెలవెలబోయాయి. టిడిపికి చెందిన కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, ఉరుకూటి నారాయణరావు ఈ అవిశ్వాస సమావేశానికి డుమ్మాకొట్టడంతో ఒకానొక దశలో తీవ్ర స్థాయిలో కూటమి నేతల్లో కలవరం మొదలైంది. అయితే నాలుగు రోజుల క్రితం జనసేనలో చేరిన వైసిపికి చెందిన 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైసిపి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె, ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక వీరిద్దరూ కూటమికి జై కొట్టడంతో అంతా ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు. వాస్తవానికి తిప్పల వంశీరెడ్డి ఓటింగ్‌కు దూరంగా ఉండాలని భావించినట్టు ప్రచారం జరిగింది. అయితే, అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవ చేసి ఇంటి నుంచి జివిఎంసి కార్యాలయం వరకూ తన కారులో వంశీరెడ్డిని కారులో తీసుకొచ్చారు. ఆఖరుకు అతని ఓటే కూటమికి వరంలా మారిందన్న చర్చ సాగింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పాత మిత్రుడైన ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మధ్యనున్న పాత రాజకీయ బంధం కూడా 'కూటమి'కి ముత్తంశెట్టి కుమార్తె లక్ష్మీ ప్రియాంక రూపంలో చివరి నిమిషంలో ఓటువేసేందుకు దోహదపడిందని చర్చ నడిచింది

అవిశ్వాస తీర్మానం నెగ్గిందిలా..

జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసిలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం జరిగింది. అవిశ్వాసం నెగ్గడానికి 74 మంది అనుకూలంగా చేతులెత్తడంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి (వైసిపి)పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ నేపథ్యంలో టిడిపి ఫ్లోర్ లీడర్‌ను పీలా శ్రీనివాసరావును మేయర్ అభ్యర్థిగా కూటమి నేతలు నేడో, రేపో



అవిశ్వాసం నెగ్గిన అనంతరం సంబరాల్లో పీలా శ్రీనివాస్, తదితరులు

ఎన్నుకోనున్నారు. వాస్తవానికి జివిఎంసిలో 98 వార్డులకుగానూ 21వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ 2024 ఎన్నికల్లో జనసేన ఎంఎల్‌ఎగా గెలవడంతో ఆ స్థానం ఖాళీ అయి కార్పొరేటర్ స్థానాలు 97కి చేరాయి. జివిఎంసి ఎన్నికల్లో 58 కార్పొరేటర్లను వైసిపి తొలుత గెలుచుకుంది. అయితే, 2024 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో వైసిపి నుంచి ఒక్కొక్కరుగా టిడిపి, జనసేనలోకి జారుకున్నారు. దీంతో విశాఖ మేయర్‌ను దించేయాలని టిడిపి కూటమి కార్పొరేటర్లు నిర్ణయించుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి పదవీ కాలం గడువు సమీపిస్తున్నా అవిశ్వాస తీర్మానానికి కూటమి నేతలు సిద్ధపడ్డారు. గడచిన కొన్ని రోజులుగా కూటమికి చెందిన కార్పొరేటర్లంతా దేశ, విదేశాల్లో పర్యటనలు చేశారు. ప్రత్యేక శిబిరంలోనే 18వ తేదీ వరకూ ఉన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని దసపల్లా హోటల్‌కు చేరుకుని అక్కడి నుంచి ఎసి బస్సులో శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసి కౌన్సిల్ హాలుకు చేరుకున్నారు. కార్పొరేషన్‌లో టిడిపికి 49, వైసిపికి 30, జనసేనకు 14, బిజెపికి 2, సిపిఎం 1, సిపిఐ 1 కార్పొరేటర్లు ఉన్నారు. కూటమి పార్టీలకు 11 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులున్నారు. వైసిపికి ముగ్గురు ఎక్స్‌అఫీషియో సభ్యులున్నా కార్పొరేటర్లతో సహా వారెవరూ ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి రాలేదు. తొలుత ప్రకటించినట్టుగానే వారంతా సమావేశాన్ని బహిష్కరించారు. తుదకు అవిశ్వాసంపై నెగ్గగానే జివిఎంసి కార్యాలయం బయట కూటమి నేతలంతా బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మొత్తానికి ఎలాగైతేనేమీ జివిఎంసిలో ప్రజా బలంతో గెలిచిన కార్పొరేటర్లు కూటమి పార్టీలకు లేకపోయినా ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడి మేయర్ స్థానాన్ని అవిశ్వాసంతో తన్నుకుపోయారన్న చర్చ నగర వాసుల్లో నడిచింది.



బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

నాలుగు వసంతాల మేయర్ పదవి సంతృప్తినిచ్చింది

- గొలగాని హరి వెంకటకుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి మేయర్‌గా నాలుగు వసంతాలపాటు నిర్వర్తించిన పదవీ బాధ్యతలు సంతృప్తినిచ్చినట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ నగర ప్రజలకు సేవలను, సంక్షేమ పథకాలను అందించినందుకు, మౌలిక సదుపాయాలను కల్పించినందుకు ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, కార్పొరేటర్లకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి కార్పొరేటర్‌కు సమదృష్టితో నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి పాటుపడ్డానన్నారు. తనపై అవిశ్వాస తీర్మానం పెట్టిన తీరు ఎంతో కలచి వేసిందని, ఆవేదనకు లోనయ్యానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలం ఫోక్స్‌పేట సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడుని గుర్తించిన స్థానికులు108కు సమాచారం అందించారు. యువకుడిని మెరుగైన వైద్య సేవ కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇచ్చామని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటిడిఎ సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తే ఎలా ?

ప్రజాశక్తి - సీలేరు : మూడు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తే సహించేది లేదని డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మార్క్రాజ్ హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో జఠిలమైన ఆదివాసీ సమస్యలపై అర్థవంతంగా చర్చ జరగాల్సి ఉండగా, తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించి మమ అనిపిస్తే ఊరుకుండేది లేదని హెచ్చరించారు. ఆదివాసీ చట్టాలు హక్కులు ఉల్లంఘించకుండా ఆదివాసీ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని ఐటిడిఏ పాలకవర్గ సమావేశం చాలా కీలకమని, ఇలాంటి సమావేశాలు ఏడాదికి రెండు మూడు సార్లు నిర్వహించవలసి ఉందని పేర్కొన్నారు. ఐటిడిఏ పాలకవర్గ సమావేశాలను గత ప్రభుత్వం నిర్వహించలేదని, ప్రభుత్వ ప్రభుత్వం కూడా తూతూమంత్రంగా నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఐటిడిఎ సమావేశంలో సకాలంలో అర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

అధిక ఉష్ణోగ్రతలతో సతమతం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజల ఆందోళన చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఉదయం ఏడు గంటల నుంచి సూర్యుడు తీక్షణంగా ఉదయిస్తుండడంతో ఎండ తీవ్రత అధికంగా ఉంది. మూగజీవాలు, పక్షులు ఎండకి తట్టుకోలేదు సీలేరు నదిపరివాహక ప్రాంతాల్లో సేద తీరుతున్నాయి. ఎండతోపాటు ఉక్కపోత అధికంగా ఉండడంతో ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు వేడి తగ్గకపోవడంతో ప్రజలు ఇళ్ళకే పరిమితమవుతున్నారు. వర్షాలు పడుతున్నా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. జీవరాసులకు తాగడానికి నీరు కూడా దొరకడం లేదు. శుక్రవారం ఉష్ణోగ్రతకు తాళలేక శునకము బోరుబావి నుంచి వచ్చి వృధాగా పోతున్న నీటిలో సేద తీరుతూ ఉపశమనం పొందింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రతరం అవుతాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

22న సీనియర్ సిటిజన్ల కోసం ఎంజిటి - 2

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీనియర్ సిటిజన్లకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించే కార్యక్రమాన్ని ఎంజిటి - 2 పేరిట నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ పికె.జోస్ తెలిపారు. శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సహచర నిర్వాహకులు డాక్టర్ కె.రమాప్రభ, ఎస్.వీరభద్రరావులతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో, ఆటపాటలతో సీనియర్ సిటిజన్ల ఆనందోత్సాహాల నడుమ మీట్, గ్రీట్ అండ్ ట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత ఆటలు, గ్రూపు ఆటలు, నృత్యాలు, పాటలు, మిమిక్రీ, పజిల్స్, మెదడుకు పదును పెట్టే వ్యాయామాలు, కండరాలను మరింత సులభంగా, సమర్థవంతంగా కదిలించేందుకు సహాయపడే వ్యాయామాలు, జ్ఞాపకశక్తి పెంపొందించే వ్యాయామాలు తదితర అంశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ అరగంటకు లక్కీ డిప్ నిర్వహిస్తామని, బహుమతులను పోటీలలో గెలుపొందినవారికి అందజేయనున్నామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440156638, 9492348428, 9393949345 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 మార్చి నెల రికవరీ మేళాను శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మీడియాతో మాట్లాడుతూ మార్చి నెలలో 130 కేసులు నమోదయ్యాయని, 85 కేసులను విజయవంతంగా ఛేదించామని, 112 మందిని అరెస్టు చేశామని తెలిపారు. చోరీ కాబడిన సొత్తులో రూ.47,40,793 విలువగల వస్తువులు, నగదుతోపాటు రూ.48 లక్షల విలువగల 320 మొబైల్‌ఫోన్‌లను కలుపుకుని మొత్తం రూ.95,40,793 విలువగల సొత్తును రికవరీ చేశామన్నారు. వాటిని మేళా ద్వారా బాధితులకు అందజేశామన్నారు.